

# విద్యా విధానంలో 19 మార్పులు!

www.freegurukul.org
(Values, Skill Based Education In Digital)

## కస్తూరిరంగన్ కమిటీ సిఫారసు

న్యూఢిల్లీ, జూన్ 1: విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలు, విజ్ఞానాన్ని పెంచడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో నూతన విద్యా విధాన(ఎన్ఈపీ) ముసాయిదాను రూపొందించినట్లు మానవ వనరుల శాఖ పేర్కొంది. ఈ మేరకు కస్తూరిరంగన్ నేతృత్వంలోని కమిటీ ఎన్ఈసీ ముసాయిదా రూపొందించింది. ప్రస్తుత విద్యా విధానంలో ప్రధానంగా 19 మార్పులు చేయాలని సిఫారసు చేసింది. అవి..

**1** కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ(ఎంహెచ్ఆర్డీ) పేరును విద్యా శాఖ(ఎంవోఈ)గా మార్చాలి.

**2** శిశు సంరక్షణ, విద్య(ఈసీసీఈ) శిక్షణ, పాఠ్యప్రణాళికలో సమూల మార్పులు చేసి పాఠశాల విద్యలో ఒక భాగం చేయాలి.

**3** 3-18 ఏళ్ల వారి వరకు వర్తించేలా విద్యాహక్కు చట్టం 2009ని విస్తరించాలి. 3-8 ఏళ్ల వరకు ఫౌండేషన్ దశ. మూడేళ్ల పాటు పూర్వ ప్రాథమికతో పాటు 1, 2 గ్రేడ్‌లు; సన్నాహక దశ (8-11ఏళ్లు), 3-5 గ్రేడ్లు; మాధ్యమిక దశ (11-14 ఏళ్లు), 6-8 గ్రేడ్లు; సెకండరీ స్టేజ్ (14-18 ఏళ్లు), 9-12 గ్రేడ్ల వారీగా పాఠ్యాంశాల ప్రణాళిక ఉండాలి. పాఠశాలలను పాఠశాలల సముదాయాలుగా పునర్వ్యవస్థీకరించాలి.

**4** పాఠశాల విద్యా ప్రణాళికలో విషయ పరిజ్ఞాన భారాన్ని తగ్గించాలి.

**5** ఆర్ట్స్, సంగీతం, క్రాఫ్ట్స్, క్రీడలు, యోగా, కమ్యూనిటీ సర్వీస్ తదితరాలు సహా అన్ని సబ్జెక్టుల్లో కరిక్యులర్, కో కరిక్యులర్, ఎక్స్‌ట్రా కరిక్యులర్ పేరిట అభ్యసన ప్రక్రియలను వేరుచేయాల్సిన అవసరం లేదు.

**6** క్రియాశీల శిక్షణ/బోధనను ప్రోత్సహించడం ద్వారా జీవన నైపుణ్యాలు, 21వ శతాబ్దపు నైపుణ్యాలు సహా కీలక సామర్థ్యాలను అభివృద్ధి చేయడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి.

**7** ఉపాధ్యాయ విద్యలో భారీ మార్పులు చేయాలి. నాణ్యత లేని ఉపాధ్యాయ విద్యా సంస్థలను మూసివేయాలి. ఉపాధ్యాయ సన్నద్ధత/విద్యా కార్యక్రమాలు అన్నింటినీ భారీగా బహుళవిభాగాలు కలిగిన యూనివర్సిటీలు/కళాశాలలకు తరలించాలి.

**8** నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ స్టేజ్ బీఎడ్‌ను టీచర్లకు కనీస డిగ్రీ అర్హతగా మార్చాలి.

**9** ఉన్నత విద్యా సంస్థలను మూడు రకాలుగా పునర్నిర్మించాలి. అవి 1. ప్రపంచశ్రేణి పరిశోధన, అత్యంత నాణ్యమైన బోధన, 2. వివిధ విభాగాల్లో పరిశోధనల్లో భాగస్వామ్యం కల్పించేలా అత్యున్నత బోధనపై దృష్టి, 3. మిషన్ నలంద, మిషన్ తక్షశిల పేరిట అండర్ గ్రాడ్యుయేషన్ విద్యలో అత్యంత నాణ్యమైన బోధనపై దృష్టి.

**10** అండర్ గ్రాడ్యుయేట్ (3 లేదా 4 ఏళ్ల బీఎస్సీ, బీఏ, బీకాం, బీవీవోసీ) కోర్సులను బహుళ ఎగ్జిట్, ఎంట్రీ అవకాశాలుండేలా పునర్నిర్మించాలి.



**11** విద్యా కార్యక్రమాల అమలు; కేంద్రం, రాష్ట్రాల మధ్య సమన్వయం సాధించేందుకు కొత్తగా రాష్ట్రీయ శిక్షా ఆయోగ్ సంస్థను నెలకొల్పాలి.

**12** ఉన్నత విద్యలో పటిష్ఠ పరిశోధనా సంప్రదాయం, సామర్థ్యాలను పెంపొందించేందుకు జాతీయ పరిశోధనా ఫౌండేషన్ ఏర్పాటు చేయాలి.

**13** నాణ్యతా ప్రమాణాల ఏర్పాటు, నిధులు, గుర్తింపు, నియంత్రణ.. ఈ నాలుగు కార్యకలాపాలను ప్రస్తుతం జాతీయ ఉన్నత విద్యా నియంత్రణ సంస్థనే చూస్తోంది. ఇకపై వీటిని వేరుచేసి నిర్వహణను స్వతంత్ర సంస్థలకు అప్పగించాలి.

**14** పునర్వ్యవస్థీకరించిన న్యాక్ నేతృత్వంలో గుర్తింపు (అక్రిడిటేషన్)నకు ఒక అంతర్గత వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

**15** వృత్తి విద్యలో ప్రమాణాలను నిర్ధారించే సంస్థలు, యూజీసీని ఉన్నత విద్యా గ్రాంట్స్ కమిషన్(హెచ్ఈజీసీ)గా మార్చాలి.

**16** ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలను సమానంగా చూడాలి. విద్యను లాభాపేక్ష రహితంగానే ఉంచాలి.

**17** ఉన్నత విద్యలో అంతర్జాతీయీకరణను ప్రోత్సహించేందుకు అనేక కొత్త విధానాలను ప్రవేశపెట్టాలి. సార్వత్రిక, దూర విద్యా విధానంలో నాణ్యతను పెంచాలి. అన్ని స్థాయిల విద్యలో టెక్నాలజీని భాగం చేయాలి. విద్యాభ్యాసంలో లింగ వివక్ష, సామాజిక వర్గీకరణలు, ప్రాంతీయ వ్యత్యాసాలను తొలగించాలి.

**18** భారతీయ, శాస్త్రీయ భాషలను ప్రోత్సహించాలి. పాలి, పర్షియన్, ప్రాకృత భాషలకు మూడు కొత్త జాతీయ సంస్థలను ఏర్పాటు చేయాలి.

**19** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాన్స్‌లేషన్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ (ఐఐటీఐ) ఏర్పాటు చేయాలి.